జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com




✳ ఇదే నినాదంతో దందాలు, ఆక్రమణలు, పైరవీలు
✳ అధికారులపై సైతం పెత్తనం
✳ అనుచరులమంటూ మితిమీరుతున్న ఆగడాలు
✳ కూటమి ప్రభుత్వానికి మచ్చ తెస్తున్న కొందరు



# MLA గారి తాలూకా!

**శ్రీకాకుళం, నవంబరు 26 (వార్త):** కాకినాడ జిల్లాలోని పిఠాపురంలో పవన్ కళ్యాన్ ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే పవన్ గారి తాలూకా అనే నినాదం బాగా ప్రాచుర్యం పొందిన విషయం తెలిసిందే. అక్కడి యువత కొందరు తమ ద్విచక్రవాహనాలపైనే ఇదే స్లోగన్ పెట్టుకుని ఎన్నికల్లో ముందుకుసాగారు. ఇటువంటి స్లోగన్ ప్రస్తుతం శ్రీకాకుళం నడుస్తోంది. 'ఎమ్మెల్యే గారి తాలుకా' అంటూ శ్రీకాకుళం జిల్లాలోని పలువురు టీడీపీ ఎమ్మెల్యేలకు చెందిన కొందరు అనుచరులు ఉపయోగిస్తూ భూదందాలు, అక్రమణలకు పాల్పడుతున్నారు. వారికి ఎమ్మెల్యేల అండదండలు లేకపోయినప్పటికీ పసుపు కండువా వేసుకుని మరీ పైరవీలు చేస్తూ పెత్తనం సాగిస్తున్నారు. మద్యం షాపుల వద్ద నిర్వాహకులకు చెందిన వారు అనధికారికంగా షెడ్డులు వేసి మరీ లూజు మందు, మటన్, చికెన్, తదితర మాంసాహారాలు, గుట్కాలు, ఖైనీలు విక్రయిస్తున్నారు. దీన్ని ఎవరైనా ఎక్సైజ్ సిబ్బంది, అధికారులు నిలదీస్తే ఎమ్మెల్యే గారి తాలూకా అంటూ చెబుతున్నారు. ఎమ్మెల్యే గారు ఫోన్‌లో ఉన్నారు మాట్లాడండి అంటూ దబాయిస్తుండడంతో వారు మౌనం వహించక తప్పడం లేదు. అలాగే కొందరు అనధికారికంగా నదీతీర ప్రాంతాల్లో ఇసుక ర్యాంపులు ఏర్పాటు చేసుకుని ఇసుకను పెద్దపెద్ద యంత్రాలతో తవ్వేస్తూ తరలించుకుపోతున్నారు. కొందరు కొండలను గుల్ల చేస్తూ కంకరను ఇష్టారాజ్యంగా లారీల్లో దోచుకుంటున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయానికి గండిపడుతోంది.
రెవెన్యూ, పోలీసు, మైన్స్ అధికారులు అడిగితే సేమ్ టు సేమ్ డైలాగ్ చెబుతున్నారు. ఉద్దానం ఎయిర్‌పోర్టు, మూలపేట పోర్టు వస్తున్నందున పలాస కాశీబుగ్గ పట్టణాలతో పాటు చుట్టుపక్కల భూముల ధరలకు రెక్కలంటాయి. దీంతో కొందరు టీడీపీకి చెందిన వారమంటూ ప్రభుత్వ స్థలాలు, వివాదాల్లో ఉన్న స్థలాలపై కన్నేసి దొంగపత్రాలు సృష్టించి మరీ ఆక్రమించేస్తున్నారు. సెటిల్‌మెంట్లు చేసుకుని కొంత కాసులను వెనకేసుకుంటున్నారు. దీన్ని ఎవరైనా నిలదీస్తే.. మళ్లీ అదే అదే డైలాగ్ వాడుతున్నారు. జిల్లాలో పలాస, ఆమదాలవలస, పాతపట్నం, శ్రీకాకుళం నియోజకవర్గాల్లో ఇటువంటి డైలాగులు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఇకనైనా జిల్లాకు సంబంధించిన టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలు మేల్కోకుంటే వారికి ఈ డైలాగ్ చెప్పే వారి నుంచి తలనొప్పులు తప్పవు.. అని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏం చేస్తారో చూడాలిమరి.



జిల్లాలో ఏయే ప్రాంతాల్లో ఇసుక ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారో త్వరలో 'జాతీయ వార్త'లో సమగ్ర కథనం



# ఆలయాలకు మహర్దశ


✳ కొత్తమ్మతల్లి, రావివలస ఆలయాల అభివృద్ధికి రూ.8కోట్లు విడుదల
✳ త్వరలో పనులు ప్రారంభం ✳ ఫలించిన మంత్రి అచ్చెన్న కృషి

**టెక్కలి, నవంబరు26(వార్త):** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కృషి ఫలించి, సంకల్పం సిద్ధించింది. ఆలయాల అభివృద్ధికిగాను ఇచ్చిన వాగ్దానాల నెరవేర్చడంలో ఆయన ముందున్నారు. ఈ క్రమంలో రావివలస ఎండల మల్లికార్జునుడి ఆలయానికి మరిన్ని వసతులు కల్పించే విధంగా 2024 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఆలయ అభివృద్ధికి మూడు కోట్ల రూపాయల నిధులు విడుదల చేస్తూ కూటమి ప్రభుత్వం జీవో విడుదల చేసింది. త్వరలోనే టెండర్లు పిలిచి ఖరారు చేసిన పనులకు శ్రీకారం చుట్టనున్నారు. అలాగే కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి ఆలయానికి మరిన్ని వసతులు సమకూర్చే విధంగా ఐదు కోట్ల రూపాయలు విడుదల చేయించారు. కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వ అధికారిక పండుగగా చేయించి గొప్ప సంకల్పాన్ని చాటుకున్నారు. మూడు రోజుల పాటూ ఈ ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా సాగాయి. ఆ రోజే ఆయన మీడియా ముఖంగా ఆయన మాట ఇచ్చారు. వచ్చే ఉత్సవాలకు ఈ ఆలయంను మరింత శోభయమానంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారమే నిధులు మంజూరు చేయించారు. దీంతో టెక్కలి నియోజకవర్గంలో ఆలయాలకు మహర్దశ పట్టనుందని నియోజకవర్గ ప్రజలు చెబుతున్నారు.



# దైవ దర్శనం చేసుకుని వస్తుండగా..

✳ తమిళనాడులోని రామేశ్వరం వద్ద రోడ్డు ప్రమాదం ✳ టెంపో ట్రావెలర్‌ను ఢీకొట్టిన కారు ✳ పలాసకు చెందిన ఇద్దరు యువకుల మృతి, నలుగురికి గాయాలు ✳ మరణవార్త తెలిసి కన్నీరుమున్నీరవుతున్న కుటుంబీకులు ✳ వీరరామచంద్రపురం, పెదంచలలో విషాదం









**పలాస, నవంబరు 26 (వార్త):** అయ్యప్ప దీక్ష విరమించుకుని తిరిగి వస్తున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఇద్దరు మృత్యువాత పడగా, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరం వద్ద బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పలాస మండలం వీరరామచంద్రపురం గ్రామానికి చెందిన పైడి సాయికుమార్(24), పెదంచల గ్రామానికి చెందిన ఇల్లాకుల నవీన్(23)తో పాటు తమ్మినాన గణేష్, గుంట రాజు, పైడి తారకేశ్వరరావు, పైడి గణపతి అయ్యప్ప మాలధారణ చేశారు. ఈ నెల 22న సాయికుమార్‌కు చెందిన కారులో వీరంతా శబరిమలై వెళ్లారు. అక్కడ అయ్యప్పస్వామిని దర్శించుకుని దీక్షను విరమించారు. మంగళవారం రామేశ్వరం వెళ్లి స్వామిని దర్శించుకుని తిరుగుపయనమయ్యారు. బుధవారం వేకువజామున దట్టమైన పొగమంచు కారణంగా వీరు ముందు వెళుతున్న టెంపో ట్రావెలర్స్‌ను బలంగా ఢీకొట్టారు. దీంతో సాయికుమార్, నవీన్ అక్కడికక్కడే మృతి చెందారు. మిగతా నలుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. తమిళనాడు పోలీసులు హుటాహుటిన స్పందించి క్షతగ్రాతులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. రోడ్డు ప్రమాదం జరిగిందన్న విషయం తెలుసుకున్న కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. వీరరామచంద్రపురం, పెదంచల గ్రామాల్లో విషాదం నెలకొంది.




# యువకుడిపై దాడి ఘటనలో ఐదుగురు అరెస్టు

✳ టెక్కలి సీఐ విజయ కుమార్

**శ్రీకాకుళం, నవంబరు 26 (వార్త):** టెక్కలి మండలం గోపీనాథపురం గ్రామంలో జరిగిన దాడి కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి, వారు ఉపయోగించిన ఆయుధాలు స్వాధీనం చేసుకున్నామని టెక్కలి సీఐ ఎ.విజయకుమార్ తెలిపారు. బుధవారం టెక్కలి పోలీస్‌స్టేషన్‌లో ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. టెక్కలి మండలానికి చెందిన కొమనపల్లి కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈనెల 23న రాత్రి సుమారు ఏడు గంటల సమయంలో ఆమె చిన్న కుమారుడు కొమనపల్లి పద్మనాభం గ్రామస్తులకు ప్రమాదం కలిగిస్తాడన్న భయంతో, గోపీనాథపురం గ్రామానికి చెందిన చితారు చంద్రశేఖర్, ధవళ నర్సింగరావు, ధవళ రాంబాబు, దుప్పట్ల మల్లేశ్వర రావు ధవళ రామరాజుతో పాటు మరికొందరు ముందస్తు ప్రణాళికతో, ఇనుపరాడ్లు, కర్రలతో దాడి చేశారు. గాయాలపాలైన పద్మనాభంను తొలుత టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చగా, అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మరణించాడు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు ఈనెల 26న రావివలస గ్రామ జంక్షన్ వద్ద, నౌపడ రైల్వే స్టేషన్‌కు పారిపోతున్న క్రమంలో టెక్కలి పోలీసులు ఈ ఐదుగురిని అరెస్టు చేశారు. వారివద్ద నుండి ఇనుప రాడ్లు, కర్రలు, రక్తం తడిసిన బట్టలు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పలాస కోర్టులో హాజరు పరిచినట్టు సీఐ తెలిపారు. అయితే మరణించిన పద్మనాభం 2008లో ఐటీబీపీలో ఉద్యోగంలో చేరినప్పటికీ, మానసిక సమస్యల కారణంగా 2016లో ఉద్యోగం నుండి తొలగించబడ్డాడు. అప్పటి నుంచి గోపీనాథపురం గ్రామంలో తల్లితో కలిసి నివసిస్తున్నాడు. గ్రామంలో పలువురితో వాగ్వాదాలు, గొడవలు పడేవాడని సీఐ తెలిపారు.

# 29 కిలోల గంజాయి స్వాధీనం

**ఇచ్ఛాపురం, నవంబరు 26(వార్త):** ఇచ్ఛాపురం పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి 29 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని సీఐ ఎం.చిన్నంనాయుడు తెలిపారు. బుధవారం ఇచ్ఛాపురం పోలీస్‌స్టేషన్‌లో ఆయన మీడియాకు పలు వివరాలను వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా పటాపూర్ గ్రామానికి చెందిన సంజుక్త దాస్, లోక్ నాథ్ ప్రధాన్‌లు గంజాయి రవాణా చేస్తుండగా పట్టుకున్నామన్నారు. సంజుక్త దాస్ తన భర్త మరణం తరువాత ఆర్థిక సమస్యల కారణంగా గంజాయి తరలింపు వ్యాపారంలో పాల్పంచుకుందన్నారు. గంజాయిని సూరత్‌కు తీసుకువెళ్లి రంజాన్ ప్రధాన్‌కు విక్రయిస్తోందన్నారు. వీరిద్దరూ ఇచ్ఛాపురం వద్ద రైలులో ఎక్కేందుకు వచ్చిన సమయంలో, ఇచ్ఛాపురం టౌన్ పోలీసు స్టేషన్ ఎస్ఐ, సిబ్బంది పట్టుకున్నారన్నారు. కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

# నేటి నుంచి ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఎన్నికలు



**పలాస, నవంబరు 26(వార్త):** పలాస యూనిట్ ఏపిఎన్జి జీవోస్ ఎన్నికల్లో పలాస వజ్రపు కొత్తూరు మండలా లలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ కాశీబుగ్గ హైస్కూల్ రోడ్లో గల అసోసియేషన్ భవనమందు ఉదయం 10 గంటలకు హాజరై ఎన్నికల్లో పాల్గొనాలని పలాస ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షులు బోనెల. గోపాల్ బుధవారం కోరారు. ఈ ఎన్నికలు నవంబర్ 27 వ తేదీ నుండి డిసెంబర్ 4వ తేదీ వరకు శ్రీకాకుళం జిల్లాలో గల వివిధ యూనిట్లు ఎన్నికలు జరుపబడునని జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం తెలియజేశారు. పలాస యూనిట్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియకు ఉద్యోగులంతా పెద్ద ఎత్తున పాల్గొవాలని కోరారు. ఎన్నికల అధికారిగా డిప్యూటీ అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ కమిషనర్ రాయి వేణుగోపాల్ వారిని నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలాస సెక్రెటరీ బి.ఉపేందర్‌రావు, ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ దుర్గాప్రసాద్ పట్నాయక్, జాయింట్ సెక్రెటరీ ఉదయ శంకర్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- స్టేట్ ట్యాక్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ రాయి వేణుగోపాల్
- దళిత, బహుజన, మైనార్టీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం
- రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళు లర్పించిన నాయకులు



**శ్రీకాకుళం టౌన్, నవంబరు 26(వార్త):** రాజ్యాంగ రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని శ్రీకాకుళం స్టేట్ ట్యాక్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ రాయి వేణుగోపాల్ అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకి రాజ్యాంగం దిక్సూచి అని అటువంటి దానిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శ్రీకాకుళంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద బుదవారం దళిత,బహుజన ,మైనార్టీ సంఘాల జేఏసి ఆద్వర్యంలో నిర్వహించిన 76వ రాజ్యాంగ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డా. బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి రాయి వేణుగోపాల్, జేఏసి నాయకులు తైక్వాండో శ్రీను, డా.కంఠ వేణు, గద్దెబోయిన కృష్ణారావు, అర్జి ఈశ్వరరావు, శీర రాజేశ్వరి తదితరులతో కలసి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. అనంతరం వారంతా రాజ్యాంగ పరిరక్షణకు తమ వంతుగా అంకితభావం కృషి చేస్తామని వారంతా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా స్టేట్ ట్యాక్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ వేణుగోపాల్ మాట్లాడుతూ "భారత రాజ్యాంగ సృష్టికర్త డా.బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను ప్రతి పౌరుడు ఆచరించాలన్నారు. సమాజంలోని బడుగు, బలహీన వర్గాలతో పాటు అగ్రకుల పేదలకు కూడా అంబేద్కర్ నిజమైన దేవుడిగా నిలిచారన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడటం, ధ్యేయాలను చేరుకోవడం కోసం యువత కృషి చేయాలన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగం భారత రాజ్యాంగం కావడం దేశ ప్రజలందరికీ గర్వకారణం" అని పేర్కొన్నారు. బహుజన జేఏసీ కన్వీనర్ డా. కంఠ వేణు మాట్లాడుతూ "రాజ్యాంగం మనకు ఇచ్చిన హక్కులు, స్వేచ్ఛలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందుకోసం సమాజంలోని అన్ని వర్గాల వారు ఐక్యంగా కృషి చేయాలన్నారు. అంబేద్కర్ చూపించిన సమానత్వ మార్గం మాత్రమే భారత ప్రజాస్వామ్యాన్ని బలపరుస్తుందన్నారు సమాజ సేవ, న్యాయం, సమాన హక్కుల సాధన కోసం జేఏసీ నిరంతరం కృషి చేస్తూనే ఉంటుందన్నారు. అంబేద్కర్స్ ఇండియా మిషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను మాట్లాడుతూ అందరికీ సమాన హక్కులు ఇచ్చిన పవిత్ర గ్రంథం రాజ్యాంగం అన్నారు. నేటి యువత రాజ్యాంగాన్ని చదివి, అర్థం చేసుకుని, అనుసరించే బాధ్యత తీసుకోవాలన్నారు. సమాజంలో అన్యాయం, వివక్ష ఎక్కడ కనిపించినా దాన్ని ఎదుర్కొనే ధైర్యం రాజ్యాంగం మనకు ఇచ్చిందన్నారు. అంబేద్కర్ చూపిన మార్గం నిజమైన ప్రజాస్వామ్యానికి పునాది అన్నారు. దళిత-బహుజన-మైనార్టీ వర్గాలు మాత్రమే కాదు, ప్రతి భారతీయుడు రాజ్యాంగ విలువలను హృదయంలో పెట్టుకుని ముందుకు సాగాలన్నారు. సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ ఇవన్నీ మాటల్లో కాదు, చేతల్లో ఆచరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, బహుజన సంఘాల ప్రతినిధులు, నాగరాజు, పెయ్యల చంటి, అబ్బాస్, విజయ్, అఖిల్ తో పాటు యువత పాల్గొన్నారు.

### ఎమ్‌హెచ్ స్కూల్‌లో రాజ్యాంగ దినోత్సవం




**శ్రీకాకుళం, నవంబరు 26(వార్త):** అరసవల్లిలోని ఎమ్‌హెచ్ స్కూల్‌లో రాజ్యాంగ దినోత్సవం బుధవారం నిర్వహించారు. తొలుత పాఠశాల ఉపాధ్యాయులు భారత రాజ్యాంగ పరిషత్ అధ్యక్షులు బాబూ రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి, రాజ్యాంగ రచనా కమిటీ అధ్యక్షులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పుష్పమాలలు వేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యా యులు సదాశివుని శంకరరావు మాట్లాడుతూ విద్యార్థులంతా భారత రాజ్యాంగ పీఠికలో అంశాలను, రాజ్యాంగ లక్ష్యాలను అవగాహన చేసుకొని దేశాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయాలని" కోరారు. పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఆర్.అన్నాజీరావు మాట్లాడుతూ "రాజ్యాంగ సభ ముసాయిదా కమిటీ చైర్మన్ గా రాజ్యాంగ రచనలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మరియు రాజ్యాంగ సభ సభ్యులు విశేషమైన కృషి జరిపి మనకు రాజ్యాంగాన్ని అందించా రని, వారిని గౌరవించుకోవడం మనందరి బాధ్యత అని, రాజ్యాంగం దేశ పాలనా వ్యవస్థకు పునాది వంటిదని, భారత రాజ్యాంగం గూర్చి ప్రతి ఒక్కరు అవగాహన కల్పించు కోవాలని, క్రమశిక్షణ కలిగిన పౌరులుగా దేశ సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేయాలని" విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా భారత రాజ్యాంగ ప్రవేశిక ప్రతి జ్ఞను ఉపాధ్యాయులు, విద్యార్థులు చేశారు. తదుపరి పాఠశాలలో నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు వ్యాసరచనలోవి.భాను ప్రసాద్, పి.రేణుక, ఎస్.ప్రవీణ్ చంద్, డిబేట్ లో ఆర్.విశాలి,పి.సత్య ఇందు,ఎస్.ధరణి, క్విజ్ పోటీలో ఆర్.యామినిదేవి, పి.సత్య ఇందు, వి.భానుప్రసాద్‌లను ఉపాధ్యాయులు చాడ శ్రీనివాస్, టీవి రమణమూర్తి, టి.ధనలక్ష్మి, కె.సౌమ్య గాయత్రి, అన్వర్ ఉన్నీసా బేగం మొదలగువారు పలు బహుమతులు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

### ఇంటింటి చెత్త సేకరణ పక్కాగా జరగాలి: డీపీఓ




**జి.సిగడాం, నవంబరు 26(వార్త):** గ్రామాలలో ఉన్న చెత్త సంపద కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయితీ అధికారిణి సౌజన్య భారతీ అన్నారు. బుధవారం వాండ్రంగి గ్రామాన్ని ఆమె సందర్శించారు. ఇంటింటి చెత్త సేకరణ పక్కాగా జరగాలన్నారు.గ్రామాలలో పారిశుధ్య మెరుగుకు ప్రభుత్వం వివిధ రకాల చర్యలు చేపడుతుందన్నారు.ఇంటింటి చెత్తసేకరణ, మంచినీటి సరఫరా, పారిశుధ్య పనులు, ఐవీఆర్ఎస్ కాల్స్ పై ప్రజలకు అవగాహన కల్పించారు. విదినిర్వహణలో అలసత్వ వహించదన్నారు. ఎప్పటికప్పుడు మురికి కాలువాలలో పేరుకుపోయిన పూడికలను తొలగించి, తాగునీటి వనరులు, నీటి బోర్లు, నేల బావుల వద్ద క్లోరినేషన్, శానిటేషన్ చేయించాలన్నారు. తడిచెత్త, పొడి చెత్త వేరు చేసే విదానంపై ప్రజలకు తెలియజేయాలన్నారు. చెత్తా చెదారాలు, వ్యర్థ పదార్థాలు రోడ్లుపై, వీదులలో, కాలువాలలో వేయకుండా చెత్త సేకరణ రిక్షాలలో వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. చెత్తతో సంపద సృష్టిపై ప్రజలను చైతన్యవంతులు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈమె వెంట ఎంపీడీవో జి రామకృష్ణ, ఎచ్చెర్ల ఏఎంసీ ఉపాధ్యక్షుడు బూరాడ వెంకటరమణ, సర్పంచ్లు సాకేటి నాగరాజు, బుడారి లక్ష్మణరావు, పంచాయితీ కారదర్శి గౌరీశంకర్, అగ్రికల్చర్ అసిస్టెంట్ ముంతా హేమంత్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### సీర గోపాలకృష్ణ మృతి తీరని లోటు



**మందస, నవంబరు 26(వార్త):** ఏపీటీఎఫ్ నాయకునిగా, ఉద్యమ నాయకునిగా, ఉపాధ్యాయునిగా సీర గోపాలకృష్ణ ఎంతో మంచి సేవలందించారని పలువురు వక్తలు కొనియాడారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు సీర గోపాలకృష్ణ సంతాపసభమందసలో జరిగింది. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అంపోలు త్రినాథరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయవృత్తి, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి, సోషల్ వర్కర్‌గా ఆయన చేసిన కృషిని కొనియాడారు. గోపాలకృష్ణ మృతి తీరనిలోటని, ఆయన ఆత్మకు శాంతి కలగాలన్నారు. ఈ సందర్భంగా సీర గోపాలకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించి, ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అంపోలు త్రినాథరావు, వాయిలపల్లి నారాయణరావు, కొర్ల పాపారావు, దువ్వు రామారావు, జి.వి. స్వామి, మజ్జి బాబారావు, గోపాలకృష్ణ సోదరుడు సీర జగ్గారావు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

### 29న మందస మండల సమావేశం

**మందస, నవంబరు 26(వార్త):** మందస మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 29న నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ వై.వెంకటరమణ చెప్పారు. మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే ఈ సమావేశానికి ఆహ్వానితులు, సభ్యులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

### అంబుగాంలో ఘనంగా సాంఘిక శాస్త్ర దినోత్సవం

**మందస, నవంబరు 26(వార్త):** అంబుగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు ఏ.సీతమ్మ అధ్యక్షత వహించిగా, సీనియర్ ఉపాధ్యాయులు సాహుకారి కోదండరాం, ఎస్.కిరణ్ కుమార్, ఎం.మాలతీరత్న, దీనబందు, భాస్కరరావు, శ్రీముఖి, పి.ప్రమీల, తెలుగు ఉపాధ్యాయుడు కె.ధనరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎస్.కిరణ్ కుమార్ కు పాఠశాల తరఫున అభినందించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చాలా ఆకట్టుకున్నాయి. ప్రాజెక్టులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కూడా అందజేశారు.



## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

**ప్రజా ప్రతినిధులతో కలిసి శానిటేషన్‌ను పర్యవేక్షించిన కమిషనర్ శ్రీనివాసులు**



**పలాస, నవంబరు 26(వార్త):** పరిశ్రమలు పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలకు చెప్పాల్సింది ప్రజాప్రతినిధులేనని పలాస మున్సిపల్ కమిషనర్ ఐ శ్రీనివాస్ అన్నారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో త్రాగునీటి సరఫరా జరుగుచున్న విధానాన్ని బుధవారం బుధవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తమ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టారు. పలాస 3వ బావి వద్ద జరుగుచున్న పంపింగ్ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు సరఫరా చేయవలసిందిగా అధికారులను ఆదేశించారు. రోజువారి శానిటేషన్ తనిఖీలో భాగంగా 25 వ వార్డు కౌన్సిలర్ బోర చంద్రకళ, వార్డు ఇన్చార్జిలతో కలిసి రెడ్డికి వీధి, చంద్రశేఖర్ ఆలయం పారసాంబ రోడ్లలో శానిటేషన్ పనులను పర్యవేక్షించారు.

ఈ పర్యటనలో కాలువలలోను, రోడ్ల పైన ప్రజలు చెత్తను వేయకుండా శానిటేషన్ వాహనాలకు మాత్రమే చెత్తను అందించవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పురుషోత్తపురం వీధిలోని స్టేట్ బ్యాంకు రోడ్డు, కేటి రోడ్లలో శానిటేషన్ పర్యవేక్షణ చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డిఈ కనకరాజు, శానిటరీ ఇన్స్పెక్టర్ శేఖర్, శానిటేషన్ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం



**పలాస, నవంబరు 26(వార్త):** రాష్ట్రంలో రైతును రాజుగా మార్చాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు.

తాళబద్రలో బుధవారం జరిగిన రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి రైతులతో మాట్లాడారు. రైతులు ఆధునిక వ్యవసాయం మెళుకువలు నేర్చుకోవాలని, లాభసాటి వ్యవసాయ పద్ధతిలో రైతులు ముందుకు వెళ్లాలని కోరారు. వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాలని, ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, పలాస ఆర్డిఓ జి వెంకటేష్, తాసిల్దార్ టి కళ్యాణ్ చక్రవర్తి, వ్యవసాయ శాఖ ఏడి రామారావు,ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, పలాస పి ఎస్ సి ఎస్ అధ్యక్షులు వంకల కూర్మారావు, టిడిపి నాయకులు పిరుకట్లవిఠల్, దువ్వాడ శ్రీకాంత్, గాలి కృష్ణారావు, లోడగాల కామేష్, ఎం నరేంద్ర, సప్ప నవీన్, జి సూర్యనారాయణ, రైతులు, టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగ ప్రవేశిక సామూహిక పఠనం




**పలాస, నవంబరు 26(వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సాంవిధానిక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ప్రిన్సిపాల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి ఆదేశాల మేరకు పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో "హమారా సంవిధాన్-హమారా స్వభిమాన్" కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ విద్యార్థుల చేత భారత రాజ్యాంగ ప్రవేశిక యొక్క సామూహిక పఠనం నిర్వహించి, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతి సంవత్సరం నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం జరుపుకోవడం వెనుక కారణాన్ని వివరించిన ప్రిన్సిపాల్, 1949 నవంబర్ 26న రాజ్యాంగ పరిషత్తు భారత రాజ్యాంగాన్ని ఆమోదించినందున ఈ దినాన్ని దేశం మొత్తం స్మరించుకుంటుందని తెలియజేశారు. రాజ్యాంగంలో ప్రతిష్టించిన మూల సూత్రాలు, విలువలు, పౌరుల హక్కులు -బాధ్యతలు అందరికీ అర్థమవ్వాలన్నదే ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల చేత పోస్టర్ ప్రజెంటేషన్ నిర్వహించగా, ఉత్తమ ప్రదర్శనలు చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు, విద్యార్థుల సక్రియ భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఐ క్యు ఏ సి కోఆర్డినేటర్ పి. వెంకటరమణ, లైబ్రేరియన్ నరసింహులు, డాక్టర్ వై. వెంకటలక్ష్మి (హిందీ), డి. సాయిరాం (పొలిటికల్ సైన్స్) తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

### సుబ్రహ్మణ్యస్వామికి 'వజ్జ' పూజలు



**పలాస, నవంబరు 26(వార్త):** సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా పలాస మున్సిపాలిటీ పరిధిలోని పురుషోత్తపురం సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు. అనంతరం రెడ్డిక వీధి, ఎల్లమ్మ ఆలయం వద్ద ఆలయాలకు చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవచింతన, ఆధ్యాత్మిక సేవ మనిషికి చాలా ముఖ్యమని అన్నారు. పరోపకారా ప్రతి ఒక్కరూ చేయాలని కోరారు. మనిషి ఎంతగా ఎదిగే ఉన్నా మానవుడు తన సహజ శైలి విడిచిపెట్టకూడదని అన్నారు. ఈయనతో పాటు శాసమాను మౌళి, రవి, సప్ప నవీన్, టిడిపి కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

### నేటి నుంచి జీఆర్ పురంలో మండల స్థాయి ఆటల పోటీలు



**మందస, నవంబరు 26(వార్త):** గుడారిరాజమణిపురం(వీరగున్నమ్మపురం) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలాలో ఈ నెల 27 నుంచి మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్టు ప్రధానోపాధ్యాయుడు కె.రమణమూర్తి, పీడీ ఎస్.రామారావు చెప్పారు. రెండు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయన్నారు. మొదటిరోజు ఉదయం 9గంటలకు బాయ్స్ సీనియర్, జూనియర్ కబడ్డీ పోటీలు, బాలికల వాలీబాల్, ఖోఖో సీనియర్స్, జూనియర్లు విభాగంలో పోటీలు జరుగుటాయన్నారు. రెండవ రోజు 28న బాలికల కబడ్డీ సీనియర్స్, జూనియర్స్, బాలురు వాలీబాల్, ఖోఖో సీనియర్స్, జూనియర్స్ జరుగుతాయని, ఇదే రోజున ఉదయం 7గంటలకు బ్యాడ్మింటన్ బాయ్స్, గర్ల్స్ సీనియర్స్, జూనియర్స్ జరుగుటాయన్నారు. మందస మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు గమనించి, ఆయా సమయంలో టీములు పాఠశాల ఆవరణలో చేరుకోవాలని తెలిపారు.

### వైభవంగా కళ్యాణ మురుగన్‌స్వామి కళ్యాణం

**జి.సిగడాం, నవంబరు 26(వార్త):** సంతవురిటిలో బుధవారం ఆలయ ధర్మకర్తలు పిల్లల శివకుమార్, దౌలూరు వెంకటరమణల ఆధ్వర్యంలో శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామికి విశేష ద్రవ్యములతో భక్తుల స్వహస్తాలతో అభిషేకాలు, హెమాలు చేసారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి పురష్కరించుకొని కళ్యాణ మురగన్ స్వామి కళ్యాణం అత్యంత వైభవంగా జరిపారు. వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర, కళ్యాణ మురగన్ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను జానపద నృత్యాలు, కోలాటాల నడుమ గ్రామ పురవీదులలో తిరువీదిని నిర్వహించారు. స్వామి వార్లకు భక్తి శ్రద్ధలతో భక్తులు ప్రత్యేక పూజలు చేసారు. స్వామివారిని దర్శించుకొనేందుకు భక్తులు బారులు తీరారు. సాయంత్రం ఆలయ సమీప కొలనులో స్వామివారి తెప్పోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. భక్తుల వినోదార్థం పలు వినోద, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు భారీ మందుగుండ సామగ్రిని కాల్చారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్న సమారాధనలో గ్రామ, పరిసర గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## అర్హులందరికీ అన్నదాత-సుఖీభవ

**మందస, నవంబరు 26(వార్త):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పలాస శాసన సభ్యురాలు గౌతు శిరిషా ఆదేశాల మేరకు రైతన్న-మీ కోసం కార్యక్రమంలో భాగంగా అన్నదాత-సుఖీభవ స్కీమ్ లబ్ధిదారులు వద్దకు కూటమి నాయకులు వెళ్లి వివరాలు సేకరించారు. ఈ పథకం ద్వారా డబ్బులు పడలేదో వారి వద్దకు వెళ్ళి, ఆధారాలు తెలుసుకున్నారు. వీరికి పథకం వచ్చేలా కృషి చేస్తామన్నారు. కొంకడాపుట్టి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న బీసీ కొంకడాపుట్టి, కొంకడాపుట్టి, బురసాయి, ఎస్టీ కొంకడాపుట్టిలో తదితర గ్రామాల్లోని రైతుల ఇంటికి వెళ్లి, వారికి అగ్రికల్చర్ పరికరాలకు సంబంధించిన ఏమేమి వస్తువులు కావాలో సర్వే ద్వారా నమోదు చేశారు. అదేవిదంగా ప్రకృతి వ్యవసాయం కోసం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొంకడాపుట్టి పంచాయతీ టీడీపీ పార్టీ అధ్యక్షుడు దుంకురు బాలు, గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రశాంత్ పాత్రో, జనసేన మండల ఉప అధ్యక్షుడు ఎస్.శివ, టీడీపీ సోషల్ మీడియా ఇంచార్జి సీహెచ్ తేజ, ఎన్డీఏ కూటమి నాయకులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# భారత చరిత్రలో సువర్ణాధ్యాయం రాజ్యాంగం

### -ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

### -ఎంఈఓ మర్రిపాటి లక్ష్మణరావు



**మందస, నవంబరు 26(వార్త):** రాజ్యాంగ నిర్మాణ సభ మన రాజ్యాంగాన్ని అధికారికంగా అంగీకరించిన రోజు ఇది అని, భారతదేశ చరిత్రలో బంగారు అక్షరాలతో రాయబడిన దినమని మందస మండల విద్యాశాఖాధికారి మర్రిపాటి లక్ష్మణరావు అన్నారు. మందస మండలంలోని హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ లో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు బొడ్డేపల్లి గోపిచంద్, ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ రోజును 'సంవిధాన్ దివస్' లేదా 'భారత రాజ్యాంగ దినోత్సవం'గా జరుపుకొంటున్నామన్నారు. మన రాజ్యాంగం ప్రపంచంలోనే అతి పెద్ద, అతి సుదీర్ఘమైన రాతపూర్వక రాజ్యాంగమని, రాయడానికి పూర్తిగా 2సంవత్సరాలు, 11నెలలు, 18రోజులు పట్టిందని, మొదట 395ఆర్టికల్స్ ఉండేవని, ప్రస్తుతం 470కిపైగా ఉన్నాయన్నారు. 22భాగాలు, 12షెడ్యూల్స్, ఐదు అనుబంధాలు ఉన్నాయన్నారు. ఈ గ్రంథాన్ని చేతితోనే అందంగా రాశారని, ప్రేమ్‌బిహారి నారాయణ్ రాయిజాదా అనే కళాకారుడు దీన్ని ఇటాలిక్ లిపిలో రాశారని, ప్రతి పేజీనీ శాంతినికేతన్ కళాకారులు అద్భుతంగా అలంకరించారని, దాన్ని చూస్తే ఒక చిత్రకళా గ్రంథంలా కనిపిస్తుందని, రాజ్యాంగాన్ని రూపొందించిన మహా సమావేశాన్ని రాజ్యాంగ నిర్మాణ సభ అంటారని తెలిపారు. 1946 డిసెంబర్ 9న ఢిల్లీలో మొదటి సమావేశం జరిగిందని, మొత్తం 299 మంది సభ్యులలో 15 మంది మహిళలు కూడా ఉన్నారని, సరోజినీ నాయుడు, దుర్గాబాయి దేశ్‌ముఖ్, అమ్ము స్వామినాథన్ లాంటి గొప్ప మహిళలు ఈ చరిత్రలో భాగమయ్యారని పేర్కొన్నారు. రాజ్యాంగానికి ఒక తండ్రి ఉన్నాడని, ఆయనే డాక్టర్ భీంరావ్ రామ్‌జీ అంబేడ్కర్, బాబాసాహెబ్ అంబేడ్కర్, రాజ్యాంగ డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్ అన్నారు. ఒక చిన్న గ్రామంలో పుట్టి, కుల వివక్షను ఎదిరించి.. లండన్, కొలంబియా యూనివర్సిటీల్లో చదువుకుని, భారతదేశానికి ఈ అద్భుత రాజ్యాంగాన్ని ఇచ్చారని, 'భారత రాజ్యాంగ పితామహుడు' అయ్యారన్నారు. మన రాజ్యాంగం మనకు ఆరు బంగారు బహుమతులు ఇచ్చిందన్నారు. ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛాహక్కు, దోపిడీకి వ్యతిరేకంగా రక్షణ, మత స్వాతంత్ర్యం, విద్యా%-%సాంస్కృతిక హక్కు, రాజ్యాంగ పరిహార హక్కులని.. బాబాసాహెబ్ దీన్ని రాజ్యాంగం యొక్క హృదయం, ఆత్మ అని పిలిచారన్నారు. ఇవి హక్కులు అయితే కర్తవ్యాలు కూడా ఉన్నాయని, 11 ప్రాథమిక కర్తవ్యాలు ఉన్నాయన్నారు. రాజ్యాంగాన్ని పాటించడం, గౌరవించడం, జాతీయ జెండా, జాతీయ గీతాన్ని గౌరవించడం, దేశ సార్వభౌమత్వం, ఐక్యతను కాపాడటం, దేశాన్ని రక్షించడం, సామరస్యం, సౌభ్రాతృత్వం పెంచడం, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటం, పర్యావరణం, అడవులు, సరస్సులు, జంతువులను రక్షించడం, శాస్త్రీయ దృక్పథం, మానవతావాదం పెంచుకోవడం ప్రతి ఒక్కరూ జ్ఞానం కోసం ప్రయత్నించడమన్నారు. రాజ్యాంగం లేకపోతే ఏమవుతుందో ఒక్కసారి ఆలోచించండని కోరారు. రాజ్యాంగ పీఠికను సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు తేజేశ్వరరావు చదివి వినిపించారు. ఎల్.సాంబమూర్తి. కె.సాంబమూర్తి, పీజీటీ రమణబాబు, పీడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టులోగాం జీటీడబ్ల్యూఏహెచ్జీఎస్, కొండలోగాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి, రాజ్యాంగదినోత్సవం కార్యక్రమాల్లో ఎంఈఓ మర్రిపాటి లక్ష్మణరావు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ అశోక్‌కు సన్మానం



**ఇచ్ఛాపురం, నవంబరు 26(వార్త):** పొత్తంగి రెడ్డిక సంఘం సభ్యులు కొండ శంకర్ రెడ్డి కి రాష్ట్ర బీసీ రెడ్డి క కార్పొరేషన్ చైర్మన్ ఇచ్చినందుకు ప్రభుత్వ విప్ మరియు ఎమ్మెల్యే అశోక్ బాబు కి కొండ శంకర్ రెడ్డికి ఘనంగా సత్కరించి సన్మానించారు.

ప్రభుత్వ పాఠశాలలలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

## రాజ్యాంగ పీఠిక పోస్టర్ ఆవిష్కరణ



**సోంపేట, నవంబరు 26(వార్త):** సోంపేటకు చెందిన జై భీమ్ సేన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సంస్థ కార్యాలయంలో భారత రాజ్యాంగ పీఠిక పోస్టర్ను ఆవిష్కరించారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి జై భీమ్ సేన జిల్లా ఉపాధ్యక్షులు గొలియ ప్రకాశరావు పూలమాలవేసి నివాళు లర్పించారు. సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ నగిరి మోహన్ రావు మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు రాజ్యాంగ పీఠిక పోస్టర్లను అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బస్కా ఈశ్వరరావు, జాడు తులసయ్య, డిస్క రవి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం



**జలుమూరు, నవంబరు 26(వార్త):** జలుమూరు మండల పరిధిలోని 33/11 కేవీ చల్లవానిపేట సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మత్తు పనులు చేపట్టనున్నట్లు విద్యుత్ శాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో 28/11/2025 శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండలంలోని అనేక గ్రామాలకు విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ విద్యుత్ నిలిపివేత ప్రభావం చల్లవానిపేట, జలుమూరు, అల్లాడ, అల్లాడపేట, తాళతారియా, లింగాలపాడు, గంగాధరపేట, అబ్బాయిపేట, సుబ్రహ్మణ్యపురం, వెంకటాపురం, జోనకి, లింగాలవలస, టెక్కలిపాడు, రాన, ఈధులవలస, కరెవంజ, తిలరు, చిన్న దుగం, పెద్దదుగం, హుస్సేనాపురం, తమ్మయ్యపేట తదితర గ్రామాలతో పాటు సంబం ధిత లిఫ్ట్ సర్వీసులపై పడనుంది. మరమ్మత్తులను వేగవంతంగా పూర్తిచేయడానికి ప్రజలు సహకరించాలని కోరుతూ, విద్యుత్ శాఖ టెక్కలి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఈ.నరసింహా కుమార్ తెలిపారు. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర సేవలకు ఎటువంటి అవాంతరాలు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు స్పష్టం చేశారు.

# రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



**ఇచ్ఛాపురం, నవంబరు 26(వార్త):** రాష్ట్రస్థాయి ఖో ఖో అండర్ 14 స్కూల్ గేమ్స్ పోటీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డొంకూరు విద్యార్థులు ఎంపికయ్యారు.

ప్రధానోపాధ్యాయులు జి హేమ కుమారి ఆధ్వర్యంలో జరిగినటువంటి అభినందన సభ కార్యక్రమంలో భాగంగా ఇటీవల శ్రీకాకుళం జిల్లా ఆర్ట్స్ కళాశాల వేదికగా జరిగినటువంటి జిల్లా స్థాయి అండర్ 14 బాల బాలికల స్కూల్ గేమ్స్,ఖో ఖో ఎంపికలు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు వీరిలో బాలురు విభాగం నుంచి కార్తీక్ శరత్. గణేష్ కార్తీక్. స్టాండ్ బై గా. హేమంత్. అండర్ 14 బాలకల విభాగం లో కోకిల ఎంపిక అయ్యారు. వీరు. 28.నుండి 30.వరకు అనకాపల్లి జిల్లా లంక పాలెం వేదిక గా జరుగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఖో ఖో పోటీలకు పాల్గొన్ను న్నారు.వీరికి పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కే జానకి రావు, ఉపాధ్యాయులు వెంకటరమణ,శంకర్ రెడ్డి, కమలాకర్, రావు,గోవిందరావు నూకయ్య, పద్మావతి, సువర్ణ, రాఘవేంద్ర ఈశ్వరరావు శేషాద్రి, గంగావేని, వెంకటేశ్వరరావు, గ్రామస్తులు విద్యార్థిని విద్యార్థులు అభినందించారు.

## పూండి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై మృతదేహం



**పలాస, నవంబరు 26(వార్త):** శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం పూండి రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం రైలు పట్టాలపై గుర్తుతెలియని మృత దేహాన్ని స్థానికులు గమనించి భయాందోళన చెందుతూ.. పలాస జిఆర్పి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహం పరిస్థితి పరిశీలించి శవ పంచానామా చేపట్టి అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పలాస జి ఆర్ పి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతిని వివరాలు తెలిస్తే జి ఆర్ పి ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ సోమేశ్వరరావును ఫోన్ నెంబర్ కు 9492250069 సంప్రదించాలని కోరారు.

## రూ.1.40లక్షల సామగ్రి లింగాలవలస పాఠశాలకు వితరణ



**జలుమూరు, నవంబరు 26(వార్త):** లింగాలవలస ఉన్నత పాఠశాలకు ఐడీబీఐ బ్యాంక్ శ్రీకాకుళం శాఖ జనరల్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ రూ.1.40 లక్షల విలువైన సామగ్రిని వితరణ చేశారు. ఈ సామగ్రిలో ల్యాప్టాప్, ఆఫీసు చైర్, టేబుల్, స్టాండ్ ఫ్యాన్, ప్రింటర్లు, కుర్చీలు వంటివి ఉన్నాయి. ఎంఈఓ బి. మాధవరావు ఈ సామగ్రిని పాఠశాల హెచ్ఎం జి. వి. రమణకు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జల్లు రమణమూర్తి, బమ్మిడి శ్రీనివాసరావు, గార విశ్వనాథం కూడా పాల్గొన్నారు.

# రాజ్యాంగ స్ఫూర్తిని విద్యార్థుల్లో పెంపొందించాలి



**పోలాకి, నవంబరు 26(వార్త):** విద్యార్థి దశ నుంచే పిల్లలలో రాజ్యాంగ స్ఫూర్తి ని కల్గించి ప్రజాస్వామ్య విలువలను పెంపొందించాలని జిల్లా పరీక్షల విభాగం సహాయ కమీషనర్ చంద్రభూషణరావు అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోదూరు లో ప్రధానోపాధ్యాయులు జి.శాంతి అధ్యక్షతన రాజ్యాంగ దినోత్సవం మరియు సాంఘిక శాస్త్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. భారత రాజ్యాంగ పిత అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల లో సాంఘిక శాస్త్ర బోధనలో విశిష్ట సేవలందిస్తున్న ఉపాధ్యాయులు బి.వి.రమణ, బాడాన రాజు లను జిల్లా పరీక్షల విభాగం సహాయ కమిషనర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో శాంతి మాట్లాడుతూ ప్రపంచం లోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగము భారత రాజ్యాంగం కావడం గర్వకారణమన్నారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరమ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాడాన రాజు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి రాజ్యాంగం పట్ల అవగాహన ఏర్పచుకొని హక్కులతో పాటు బాధ్యతలు కూడా గుర్తెరిగి జీవించాలని సూచించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు బి.వి.రమణ మాట్లాడుతూ విద్యార్థులు భావి భారత పౌరులు గా ఎదిగేందుకు రాజ్యాంగంలో అంశాలు తెలుసుకోవాలని అన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన రాణి రుద్రమ దేవి ఏకపాత్రాభినయం, ఆడపిల్లల జాగృతం చేసే నాటిక, శాస్త్రీయ భరత నాట్యం, జాలరి పాట, కోలాటం వంటివి అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులు తయారుచేసిన సాంఘిక శాస్త్ర నమూనా ప్రదర్శన చూసి విద్యాశాఖాధికారులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.శాంతి, ఉపాధ్యాయులు చింతాడ లక్ష్మణరావు, మోహిని, వెంకటరమణ, నారాయణరావు, శ్రీహరి రావు, శాంతి, హేమలత, జగన్, బాడాన రాజు, వేణుగోపాలరావు, రాజేశ్వరరావు, రఫీ, కళావతి, డోల వసంత రావు, తమరాపు రాంబాబు, సూర్య కుమారి, రమణమ్మ, ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బొగిడియా పుట్టుగలో ఆధ్యాత్మిక శోభ



**కవిటి, నవంబరు 26(వార్త):** కవిటి మండలం బోరువంక పంచాయతీ బుగిడియా పుట్టుక గ్రామంలో ఆధ్యాత్మిక శోభ వెల్లి విరిసింది. ఆ గ్రామంలో శ్రీ నిమ్మాసిని అమ్మవారి ఆలయం పున ప్రతిష్ట తో పాటు మండపం ప్రతిష్ట కార్యక్రమాన్ని గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. మంగళవారం జలయాత్రతో మొదలైన ఈ ప్రతిష్ట కార్యక్రమాలు బుధ గురువారాల్లో కూడా చేపట్టనున్నారు. బుధవారం ఉదయం నుంచి ప్రతిష్ట మహోత్సవాలు ప్రత్యేక పూజలు ఒకవైపు ఘనంగా జరగగా మరోవైపు శాంతి యజ్ఞాన్ని మంత్ర చరణాల మధ్య నిర్వహించారు. హరే రామ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే నామ సంకీర్తన పారాయణం రోజంతా కొనసాగింది. 13 గ్రామాలకు చెందిన గోష్టి బృందాలు ఇందులో పాల్గొన్నాయి. బుధవారం నిర్వహించిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. గ్రామంలో ప్రతి ఇంట గుమ్మం ముందు పూర్ణకుంభాలను దీపాలను ఏర్పాటు చేశారు. వీధులను ముగ్గులతో అలంకరించారు. విద్యుత్ అలంకరణలతో గ్రామాన్ని శోభయమానంగా తీర్చిదిద్దారు.

## పాఠశాలలో మాక్ పార్లమెంట్

**జలుమూరు, నవంబరు 26(వార్త):** రావిపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి బమ్మిడి మాధవరావు హాజరయ్యారు. విద్యార్థులు మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని తిలకించి విద్యార్థులను అభినందించారు. ఇటువంటి కార్యక్రమాల నిర్వహణ ద్వారా విద్యార్థులలో సృజనాత్మక శక్తి పెరుగుతుందన్నారు. రాజ్యాంగ విలువలను తెలియజేసిన ఉపాధ్యాయులను అభినందించారు.



# బాలిగాం 'ఆదిత్య'లో భారత రాజ్యాంగ దినోత్సవం

**మందస, నవంబరు 26(వార్త):** బాలిగాంలోని ఆదిత్య జూనియర్, డిగ్రీ కళాశాల భారత రాజ్యాంగ దినోత్సవం ప్రజా విజ్ఞాన వేదిక సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ప్రజా విజ్ఞాన వేదిక ప్రతినిధి మార్పు జగన్మోహన్ రావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం గొప్పతనాన్ని, భారత పౌరులు హక్కులు, ఆర్టికల్స్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బృందం ఏ విధంగా రాజ్యాంగాన్ని రూపొందించారనే విషయంపై విద్యార్థులు అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించి, గెలుపొందిన ఎం. రోషిణి, మనీషా, శ్యామ్ లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మామిడి కోదండరావు, మద్దెల వినోద్, ఎస్. పోలయ్య , కొన్నాన ఉమాపతి, కళాశాల ప్రిన్సిపల్ ప్రవీణ్, ప్రసాద్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాక్ అసెంబ్లీ

**ఇచ్ఛాపురం, నవంబరు 26(వార్త):** ఇచ్ఛాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో రాజ్యాంగ ఆమోదిత దినోత్సవం సందర్భంగా పాఠశాలలో మాక్ అసెంబ్లీ, వివిధ ప్రాజెక్టుల తయారీతో ఎగ్జిబిషన్ నిర్వహణ, వివిధ దేశభక్తి గీతాలతో సాంస్కృతిక కార్యకలాపాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం కే సూర్యరావు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ఆశి లతరెడ్డి , కో ఆప్షన్ సభ్యుడు ఆశి గౌరీశంకర్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం






## రాజ్యాంగమే రాజ్యానికి రాచబాట

**సోంపేట, నవంబరు 26(వార్త):** ఏ దేశానికైనా రాజ్యాంగమే రాచబాటగా నిలుస్తున్న దని ప్రజా ప్రయోజ్యనార్థం ప్రజలకు సంబంధించిన పలు సమస్యలు చర్చించుకునే వేదికగా పని చేస్తోందని అధికార, ప్రతిపక్ష సభ్యులు సయోధ్యతో దేశానికి రాష్ట్రాలకు వారధిగా నిలుస్తుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. బుధవారం కొర్లం గొనకపాడు ఉన్నత పాఠశాలలో నమూనా అసెంబ్లీ కార్యక్రమాన్ని విద్యార్థులు నిర్వహించి మంత్రముగ్ధుల్ని చేసింది. ప్రధానోపాధ్యాయులు టి.కృష్ణారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, సర్పంచ్ ప్రతినిధి రాంబుడ్డి గణపతి, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎకనామిక్స్ గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

**పలాస, నవంబరు 26(వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్ గెస్ట్ అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ 55 శాతానికి పైగా మార్కులతో పూర్తిచేసి ఉండాలని, నెట్, ఏపీసెట్, పిహెచ్‌డి వంటి అదనపు అర్హత ఉన్న అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడము జరుగుతుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల నవంబర్ 28 లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈనెల నవంబర్ 29 న డెమో, ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు.

## భువికకు భరతముని నాట్యశాస్త్ర అవార్డు



**పోలాకి, నవంబరు 26(వార్త):** అమరావతి కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో మంగళవారం రాష్ట్రస్థాయి నృత్య ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఈ ప్రదర్శనలో పోలాకి మండలం గొల్లలవలస గ్రామానికి చెందిన నీలం రాజు భువిక కూచిపూడి నృత్యంలో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం దక్కించుకుంది. భువికకు భరతముని నాట్య శాస్త్ర అవార్డును నిర్వాహకులు అందజేశారు. గ్రామస్థులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

## రిజర్వేషన్ ఫలాలు అంబేద్కర్ చలువే



**పోలాకి, నవంబరు 26(వార్త):** రాష్ట్రంలో అట్టడుగు, వెనుక బడిన వర్గాలు నేటికీ రిజర్వేషన్ ఫలాలు పొందుతున్నారంటే ఆ మహనీయుడు బీఆర్ అంబేద్కర్ కృషి ఫలితమేనని పోలాకి మండల పరిషత్ అధ్యక్షుడు ముద్దాడ భైరాగి నాయుడు, సుడా మాజీ ఛైర్మన్ కె.చంద్రభూషణ గుప్తా అన్నారు. పోలాకిలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను బుధవారం నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. %ాజ% సెల్ అధ్యక్షుడు లక్ష్మణరావు పాల్గొన్నారు.

## వృత్తి విద్య కోర్సుల శిక్షణ అవసరం




**జలుమూరు, నవంబరు 26(వార్త):** వృత్తి విద్య కోర్సులలో చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ అవసరమని డీఈవీఓ సురేశ్ కుమార్ తెలిపారు. జలుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు అవగాహన కల్పించే దిశగా శ్రీకాకుళంలోని ఆటోమొబైల్ సంస్థలో శిక్షణ నిమిత్తం బుధవారం విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. విద్యార్థులతో పాటు రీజనల్ టీం సభ్యులు ఎం.పవన్, ఎం.నిరంజన్, ప్రిన్సిపల్ జె. సారిక తదితరులు పాల్గొన్నారు.

## నరసన్నపేటలో రాజ్యాంగ దినోత్సవం



**నరసన్నపేట, నవంబరు 26(వార్త):** నరసన్నపేటలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద బుధవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలను వైసీపీ నేతలు నిర్వహించారు. ఈ వేడుకల్లో నరసన్నపేట మండల పరిషత్ అధ్యక్షుడు ఆరంగి మురళి పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఈ దేశం కోసం అంబేద్కర్ చేసిన సేవలను గుర్తుకు తెచ్చుకున్నారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నేతలు పాల్గొన్నారు.

## క్రీడా మైదానంలో తుప్పల తొలగింపు

**జలుమూరు, నవంబరు 26(వార్త):** జలుమూరులోని జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉన్న తుప్పలను తొలగించామని హెచ్ఎం ఇప్పిలి వేణుగోపాలరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. మంగళవారం కూడా కొంత పనిని చేపట్టామని, మిగిలిన పనిని ఇవాళ పూర్తి చేస్తామని పేర్కొన్నారు. మండల స్థాయి పోటీలు నిర్వహిస్తున్న సందర్భంగా క్రీడా మైదానాన్ని పరిశుభ్రం చేస్తున్నామన్నారు. పాఠశాల నిధులతో ఈ పనులను నిర్వహిస్తున్నామన్నారు.



# పలాస ఎంపీపీ పెళ్లికూతురాయనే..!

**-అంగరంగ వైభవంగా పలాస ఎంపీపీ ఉంగ ప్రవీణ- మధుబాబు కళ్యాణం**

**- వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రులు ధర్మాన, డాక్టర్ సీదిరి**

**-జన సాగరంగా మారిన టెక్కలి పట్నం**

**-ఆహ్లాదకర వాతావరణంలో పెళ్లి వేడుకలు**



**పలాస, నవంబరు 26(వార్త):** యాదవ సామాజిక వర్గ ఆణిముత్యం, పలాస ఎంపీపీ ఉంగ ప్రవీణ- మధుబాబు నూతన వధూవరుల వివాహం అంగ రంగ వైభవంగా జరిగాయి. పలాస రూరల్ మండలం టెక్కలి పట్నం సమీపంలో గల మోదుగులపుట్టుక స్వగ్రామంలో ఎంపీపీ ఉంగ ప్రవీణ – మధు బాబుకు బుధవారం ఉదయం ముహూర్తంలో వేదమంత్రాల ఉచ్చరణతో.. జరిగిన ఈ పెళ్లికి బంధుమిత్రులతో పాటు రాష్ట్ర మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, డాక్టర్ సిదిరి అప్పలరాజు, వైయస్సార్ సిపి నేతలు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు మధ్య మేళ తాళాలు, వేద పండితులు, పురోహితుల వేద మంత్రోచ్ఛారణతో అంగరంగ వైభవంగా కళ్యాణం కమనీయంగా జరిగింది. పెళ్లి బాజాలు మోగే వరకు వధూవరుని ఒకే చోటుకి తీసుకురావడం అక్కడి సాంప్రదాయం కావడంతో, ముహూర్తానికి ఒక గంట ముందు పెళ్లి కుమారుని తీసుకువచ్చారు. ఈ సందర్భంగా బంధుమిత్రులు నృత్యాలు చేశారు. ఈ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రులు ధర్మాన, డాక్టర్ అప్పలరాజు వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పెళ్లికూతురు రిసెప్షన్ తో పాటు వివిధ ఈవెంట్ వేడుకలు రంగ రంగ వైభవంగా జరిగి ఆహుతులను అలరించాయి. ఎంపీపీ ఉంగ ప్రవీణ – మధుబాబు నూతన వధూవరుల పెళ్లి పందిరిలో పురోహితుల వేదమంత్రాలు సాక్షిగా మూడు ముళ్ళ బంధంతో ఒకటయ్యారు. అంగరంగ వైభవంగా జరిగిన ఈ వివాహ వేడుకలకు జిల్లాస్థాయి, మండల స్థాయి అధికారులు, రాజకీయ నేతలు, పలాస పట్టణ ప్రముఖులు, బంధుమిత్రులు పెద్ద ఎత్తున హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకలను వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి బండి దుర్యోధనరావు, జడ్పీ వైస్ చైర్ పర్సన్ ప్రతినిధి పాలిన శ్రావణి శ్రీనివాస్, మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, వైఎస్ఆర్సిపి పలాస రూరల్ మండల నేతలు దువ్వాడ రవి, పట్టణ నేతలు శిష్టు గోపి, మద్దిలి హరినారాయణ యాదవ్, బత్తిన లక్ష్మణ్, మడియ రామకృష్ణ, సొర్ర ఢిల్లీ శ్వరరావు, అందాల శేషగిరిరావు తదితరులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పలాస మండల తాసిల్దార్ టి కళ్యాణ్ చక్రవర్తి, మరియపుట్టి మండల తాసిల్దార్ బడే పాపారావు, ఎంపీడీవో వసంత కుమార్, పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, ఎంపీడీవో కార్యాలయం, సచివాలయ సిబ్బంది, ప్రముఖులు పాల్గొన్నారు.

## పలాస కోర్టు ఆవరణలో రాజ్యాంగ దినోత్సవం




**పలాస, నవంబరు 26(వార్త):** ఘనంగా భారత భారత రాజ్యాంగ దినోత్సవం వేడుకలు పలాస కోర్టు ఆవరణలో బుధవారం నిర్వహించారు. పలాస జూనియర్ కోర్టులో మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు మరియు జూనియర్ సివిల్ జడ్జి డివిజన్ యూ. మాధురి, న్యాయవాదులు, కోర్ట్ సిబ్బంది మరియు కక్షిదారులతో రాజ్యాంగ పీఠికను చదివించి ప్రతిజ్ఞ చేయించారు. భారతదేశ సార్వభౌమ, సాంఘిక లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర విలువలను కాపాడుతూ పౌరులందరికీ సమన్యాయం చేయడం రాజ్యాంగం యొక్క ప్రధాన ఉద్దేశం అని తెలియజేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చేసిన సేవలను కొనియాడారు. అంతే కాకుండా ఈరోజు వరకట్న వ్యతిరేక దినోత్సవం అని వరకట్నం ఇవ్వడం తీసుకొనడం రెండు నేరమని, వివాహ మనేది ఎంతో పవిత్రమైనదని, ఇరువురి జీవితాలు రెండు కుటుంబాలు కలిసి ప్రయాణం చేసే ఒక ప్రక్రియని, ఇటువంటి విషయాలలో వరకట్నం ముడిపెట్టరాదని, నైతిక విలువలు పాటించాలని జూనియర్ జడ్జి యు మాదిరి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ రమేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఫయాజ్ అహ్మద్, ఉపాధ్యక్షులు బికేఆర్ పట్నాయక్, జాయింట్ సెక్రెటరీ జిఎంఎస్ అనిల్ రాజ్, గవర్నమెంట్ పీల్డర్ పిండి వెంకట్రావు, సీనియర్ న్యాయవాదులు జి ప్రభాకర్, శ్యాంసుందర్, తేజేశ్వరరావు, కోత రజిని కుమార్, చిట్టిబాబు, లోకేశ్వరరావు, దివ్య, శ్రీనివాసరావు సూపర్డెంట్ కే కృష్ణ, కోర్టు సిబ్బంది పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల కోసం గ్రామాల్లోకి టీడీపీ నాయకులు



**కంచిలి, నవంబరు 26(వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహణకు పలుచోట్ల తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు గ్రామాల్లోకి వెళ్లి రైతులను నేరుగా కలుస్తున్నారు. ఇందులో భాగంగా కంచిలి మండలం మండపల్లి పంచాయతీ ఒరియా నారాయణపురం గ్రామానికి టిడిపి యువ నేత మాదిన ప్రదీప్ పలువురు తో కలిసి వెళ్లి రైతులను ప్రభుత్వ పథకాల గూర్చి మరింత అవగాహన కల్పించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయం గూర్చి వివరించారు. పంటలు మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన సదుపాయాలు గూర్చి తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెయ్యిల గణపతి, వి ఏ త్రినాథ్, కాముడు, మహేష్ పాల్గొన్నారు.

## రాజ్యాంగ రూపకల్పనలో అంబేద్కర్ సేవలు చిరస్మరణీయం






**మందస, నవంబరు 26(వార్త):** భారత రాజ్యాంగాన్ని తయారుచేయడంలో డా.బి.ఆర్ అంబేద్కర్ సేవలు వెల్లకట్టలేనివని కొత్తపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూన వేణుగోపాలరావు అన్నారు. రాజ్యాంగ, సాంఘిక శాస్త్ర దినోత్సవాలను కొత్తపల్లి ఉన్నత పాఠశాల లో ఘనంగా నిర్వహించారు.

భారత రాజ్యాంగం యొక్క గొప్పతనాన్ని గూర్చి ఉపాధ్యాయులు, విద్యార్థులకు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో స్థానిక సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయిని గువ్వాడ జానకమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులు పలు సామజిక అంశాలపై ప్రాజెక్టులను తయారుచేసి ప్రదర్శించారు.

అనంతరం రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రధానోపాధ్యాయుడు, సాంఘిక శాస్త్ర టీచర్ ని పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. అలాగే స్థానిక పాఠశాల 7వ తరగతి విద్యార్థులు ఆదిమానవుల వేశధారణలో, 10వ తరగతి విద్యార్థి అంబేద్కర్ వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.భీమారావు, ఎం.లక్ష్మణరావు, ఎ.అప్పారావు, బి.పాపమ్మ, ఎం.చిత్రసేను, జి.సూర్యనారాయణ, జి.చిన్నికృష్ణ, జి.గోపాలకృష్ణ, బి.రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం




**జలుమూరు, నవంబరు 26(వార్త):** విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామని ఎంఈఓ బమ్మిడి మాధవరావు తెలిపారు. బుధవారం ఈ వేడుకలను నిర్వహించాలని ఆయా పాఠశాలల హెచ్ఎంలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. జలుమూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం మాధవరావు, ఉపాధ్యాయుడు మెండ రామారావు ఆధ్వర్యంలో విద్యార్థులతో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేపట్టారు. అన్ని పాఠశాలల్లో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు జరిగాయి.

## మబగాంలో పారిశుధ్య కార్యక్రమాలు



**పోలాకి, నవంబరు 26(వార్త):** మబగాంలో పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరంగా చేపడుతున్నామని పంచాయతీ కార్యదర్శి శోభారాణి తెలిపారు. పనులను ఆమె బుధవారం ఉదయం సమీక్షించి మాట్లాడారు. మంగళవారం కూడా ఈ పనులను చేపట్టామన్నారు. ప్రధాన రహదారిలో వ్యర్థాలు పడి ఉండటంతో దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు తెలిపారున్నారు. స్థానిక నాయకులు కాయ రవి ఆధ్వర్యంలో పనులను పర్యవేక్షించానన్నారు.

## పందుల స్వైర విహారంతో డెంగ్యూ వ్యాప్తి



**నరసన్నపేట, నవంబరు 26(వార్త):** నరసన్నపేట గాంధీనగర్ ప్రాంతంలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇటీవల కాలంలో పందుల సంచారం ఈ ప్రాంతంలో అధికమైంది. దీంతో దోమలు వ్యాప్తి చెంది పలువురు డెంగ్యూ వంటి విషజ్వరాల బారిన పడుతున్నారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన వ్యర్థ పదార్థాలు తెచ్చి ఈ ప్రాంతంలో పందులకు పెడుతున్నారు. దీంతో ఇక్కడ పారిశుధ్య సమస్య ఏర్పడింది. పంచాయతీ సిబ్బందికి ఫిర్యాదులు చేసినా ఎటువంటి చర్యలూ లేవన్నారు.

## మాక్ అసెంబ్లీలో పాల్గొన్న నరసన్నపేట, సారవకోట విద్యార్థులు

**నరసన్నపేట, నవంబరు 26(వార్త):** రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా ప్రభుత్వం నిర్వహించిన మాక్ అసెంబ్లీలో నరసన్నపేట నియోజకవర్గానికి చెందిన ఇద్దరు విద్యార్థులు పాల్గొన్నారని ఎంఈఓ పేడాడ దాలినాయుడు తెలిపారు. బుధవారం పీఎం శ్రీ పాఠశాలలో నిర్వహించిన మాక్ అసెంబ్లీ డైరెక్ట్ రిలేను ఆయన పరిశీలించారు. నరసన్నపేట మండలం కంబకాయ గ్రామానికి చెందిన తరుణ్ సాయి, సారవకోట మండలం బుడితి గ్రామానికి చెందిన ఎం.గురు చరణ్ పాల్గొన్నారని తెలిపారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546